# రైల్వే ప్రమాదాలకు బీమా పేరిట

# ప్రజలపై భారం

**2014**లో 28,360 రైల్వే ప్రమాదాలు జరగ్గా, 25,006 మంది మృతిచెందారు. 3882 మంది గాయపడ్డారు. ప్రతి ఏడాది సగటు 15000 మంది ఈ ప్రమాదాలలో మరణిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మృతులకూ, గాయపడ్డవారికీ నష్టపరిహారాన్ని ప్రకటించి, చెల్లించటం ఇన్నాళ్లూ చేస్తూ వచ్చారు. ఈ నష్టపరిహారం చెల్లింపు భారమైందన్న సాకుతో బీమా చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా ప్రమాదనష్టపరిహారం చెల్లింపు బాధ్యత నుండి తప్పుకుని బీమాకు ప్రీమియం సొమ్ము చెల్లింపు భారాన్ని ప్రయాణీకులపై మోపబూనుకుంది.

రైల్వేశాఖ దీనికోసం టెండర్లు పిలువగా, వచ్చిన వాటిలో మూడు బీమా కంపెనీలను ఎంపిక చేసింది. ప్రమాదంలో మృతిచెందినవారికి 10 లక్షల రూ॥లు, శాశ్వత సంపూర్ణ అంగవైకల్యానికి గురైన వారికి 10 లక్షల రూ॥లు, శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి గురైన వారికి 7.5 లక్షల రూ॥లు, వైద్య ఖర్చులకు 2 లక్షల రూ॥లు, మృత శరీరాన్ని స్వస్థలానికి చేర్చేందుకు 10వేల రూ॥లు బీమా కంపెనీలు చెల్లించాల్సి వుంటుంది.

శ్రీరాంజనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతి ప్రయాణీకుడికీ 92 పైసలు ప్రీమియంను పేర్కొంది. ఐసిఐసిఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ 99 పైసలు, రాయల్ సుందరం జనరల్ ఇన్సూరెన్స్ 115 పైసలు ప్రీమియంగా పేర్కొంది. దీనితో రైల్వేశాఖ ప్రతి టిక్కెట్టు మీదా 92 పైసలను ప్రీమియంగా చెల్లించేందుకు నిర్ణయించింది.

ఇన్నాళ్లూ రైల్వేశాఖ ప్రమాద బీమాకు తన ఆదాయం నుండి ప్రీమియం చెల్లించేది. ఈ ప్రీమియం ఎక్కువగా వుందన్నది రైల్వేశాఖ వాదన. దీనిని 2008-09లో మానివేశారు. ప్రతి టిక్కెట్టు పైనా 92 పైసలు (ఆచరణలో రూపాయి అవుతుంది) వసూలు చేస్తారు. ప్రస్తుతానికి దీనిని ఆన్‌లైన్‌లో టిక్కెట్లు తీసుకున్న వారినుండే వసూలు చేస్తారట. తరువాత అన్ని తరగతులకూ వర్తింపచేస్తారట.

రోజూ సగటున 60 లక్షలమంది రైల్వేల్లో ప్రయాణిస్తున్నారు. వీటిలో 59 శాతం ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొంటున్నారు. అంటే దాదాపుగా 32 లక్షలమంది. అంటే ఏడాదికి రూ॥ 110 కోట్లు ప్రీమియంగా ప్రయాణీకులపై వసూలు చేసి బీమా కంపెనీలకు చెల్లిస్తారు. ఇది ప్రస్తుతానికి. ఇక ప్రయాణీకులందరికీ వర్తింపచేస్తే రూ॥ 250 కోట్లు దాటుతుంది.

ఇక రైల్వే ప్రమాదాలను రెండు రకాలుగా విభజించారు. ఒకటి : ప్రమాదాలు-వీటిలో రైళ్లు ఢీకొనటం, పట్టాలు తప్పటం చేర్చారు. కాగా అగ్ని ప్రమాదాలను చేర్చలేదు. రెండు అవాంఛనీయ ఘటనలు-టెర్రరిస్టు దాడులు, హింసాయుతదాడులు, దొంగతనాలు, రైలు నుండి ప్రమాదవశాత్తూ జారిపడటాలను చేర్చారు. కాపలావున్న, కాపలాలేని గేట్ల వద్ద, ఇతరచోట్లా పట్టాలు దాటుతుండగా జరిగే ప్రమాదాలను వీటిలో చేర్చలేదు. మొత్తం ప్రమాదాలలో ఇవి సగం వరకూ వుంటాయి. వీటికి ప్రధాన కారణం. పట్టాలు దాటేందుకు తగిన రక్షిత మార్గాల ఏర్పాటును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయటమే. ఆవిధంగా ఈ ప్రమాద బాధితులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా తప్పుకుంటున్నారు.

బీమా చేయటానికి ముందుకొచ్చిన కంపెనీలు, విదేశీ బీమా కంపెనీలతో ఏర్పడిన మిలాఖత్ కంపెనీలే. బీమారంగాన్ని ప్రైవేటీకరించి, విదేశీ పెట్టుబడి ప్రవేశానికి వీలు కల్పించిన ప్రభుత్వం, ఇప్పుడు వాటికి బీమా వ్యాపారాన్ని ఏర్పాటుచేసిపెట్టేందుకు పూనుకుంది. ప్రయాణీకులపై భారంమోపి, విదేశీ బీమాకంపెనీలకు కట్టబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

ooooo